క్లుప్తంగా

గంజాయిభద్రలో జగనన్న సురక్ష



ధ్రువీకరణ త్రాలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

సాలూరు: మండలంలోని గంజాయిభద్ర, జిల్లేడువలస గ్రామాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ మేరకు గంజాయిభద్ర సచివాలయానికి సంబంధించి నేరెళ్లవలసలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్పర్సన్ దండి అనంతకుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చోడిపల్లిబీసు, గమ్మెల బీసు, రామ్మూర్తి తదితరులు ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

22న వాహనాల వేలం

బలిజిపేట: సీజ్ చేసిన వాహనాలను బలిజిపేట పోలీస్ స్టేషన్లో ఈనెల 22న వేలం వేయనున్నట్లు ఎస్సై ప్రశాంత్కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక హీరో గ్లామర్ మోటార్ సైకిల్, ఒక ఆటో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగినవారు పోలీస్స్టేషన్కు వచ్చి వేలంలో పాల్గొనవచ్చని ఎస్సై ప్రశాంత్కుమార్ సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

సాలూరు: సాలూరు పట్టణం,మండలం, పాచిపెంట మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఎ.డి శంకరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సాధారణ మెయింటనెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9గం టల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందని తెలి పారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి, సహకరించాలని కోరారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వీఆర్ఏల సంఘం మండలఅధ్యక్షుడు సూరయ్య

సీతానగరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ మేరకు వీఆర్ఏల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వి.సూరయ్య మాట్లాడుతూ దీర్ఘకాలంగా వీఆర్ఏల సమస్యలు పరిష్కరించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా మూడు రోజుల పాటు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ రమణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన వేణుగోలస్వామి ఆలయప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులతో ప్రత్యేక అర్చన చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులంతా ముడుపులు చెల్లించుకోవడమే కాకుండా అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్

సీతంపేట: ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం దోమల నివారణ మందును మలేరియా నివారణా శాఖ ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. ఐఆర్ఎస్, ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని ఐటీడీఏ, గిరిజన సంక్షేమ కార్యాలయం, ఐసీడీఎస్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో స్ప్రేయింగ్ చేశారు. దోనుబాయి పీహెచ్సీ వైద్యాధికారి భానుప్రతాప్, సబ్యూనిట్ అధికారి జె.మోహన్రావు పర్యవేక్షించారు.

పార్టీలకతీతంగా సంక్షేమం



లబ్ధిదారుకు బుక్లెట్ అందించి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే జోగారావు



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రజలకు అందుతున్నాయని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటప్రకారం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేస్తున్నారని తెలిపారు. అర్హులైన వారు ఏపార్టీలకు చెందిన వారైనా వారికి సంక్షేమం అందిందా లేదా అనేది గుర్తించడం వారికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలనసాగిస్తున్నారన్నారు. పారదర్శక పాలన అందించేందుకు వలంటీర్ల వ్యవస్థతో ఇంటింటికీ పథకాలను చేరువచేసే బాధ్యతను వారికి అప్పగించి వారితో పథకాలను అద్భుతంగా పంపిణీ చేసే ప్రక్రియ మరెక్కడా లేని గొప్ప కార్యక్రమమని తెలిపారు. అటువంటి సేవలను అందిస్తున్న వలంటీర్లపై తప్పుడు కూతలు కూస్తున్న నాయకులకు, గొప్ప సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిపై కక్ష పూరితంగా విమర్శలు చేస్తున్న వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ జి.నాగమణి, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జి.జగన్, శ్రీనివాసరావు, సీహెచ్.సత్యంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, సర్పంచ్లు సుందరరావు, విజయ, ఆర్.శ్రీనివాసరావు, జి.సత్యంనాయుడు, టి.ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు చేరువగా పాలన

జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు పాలన చేరువైందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని మిర్తివలస, బర్లి సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సేవలను సత్వరమే అందించే విధంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా, వారి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. 11రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పరిష్కరించి లబ్ధిదారుల ఇళ్లకే వలంటీర్లు వచ్చి అందజేసేలా సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకంతో సేవలు మరింత సులువయ్యాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అప్పలనాయుడు, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, ఎంపీటీసీ జి.శారద, జి.జగన్, పి.నారాయణరావు, బి.కృష్ణ, కృష్ణమోహన్, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో బహుళ ప్రయోజనాలు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష పథకంతోనే ప్రజలందరికీ బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం లచ్చయ్యపేటలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, లక్ష్మీపురంలో తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. లచ్చయ్యపేటలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన ఒంటరి, కుల, ఆదాయం, రైస్ కార్డులు తదితర 11రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. లక్ష్మీపురంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ,వైఎస్సార్సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు, ఎంపీటీసీ పార్వతి, సర్పంచ్ సత్యవతి సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు.

108 వాహనాల తనిఖీ

సీతానగరం:

మండలంలోని 108 వాహనాలను, రికార్డులను ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ గిరిబాబు గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం అప్పగించిన గురుతరమైన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. రోగులకు ఇప్పటికే అత్యవసర సేవలు నిరంతరం అందిస్తున్నప్పటికీ ఇంకా అంకిత భావంతో సేవలందించాలని పిలుపునిచ్చారు. రోగులకు అత్యవసర సేవలందిస్తున్న 108 వాహనాల ద్వారా ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వాహనాలకు సంబందించిన రికార్డులు, మందుల నిల్వలు, వాహనం కండిషన్ పరిశీలించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ గిరిబాబు

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో గ్రామీణులు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎం.సింగుపురం పీహెచ్సీ వైద్యాధికారి కె.చిరంజీవి అన్నారు. మండలంలోని జంపరకోట సచివాలయ పరిధి వెంకటరాయునివలస గిరిజన గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో గల నీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించారు. వీధి కాలువల్లో మలాథియాన్, దోమల నివారణా మందులు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.భూలక్ష్మి, ఏఎన్ఎం టి.రామలక్ష్మి, హెల్త్ సహాయకులు ఎ.పెంటయ్య తదితరులుర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: లుంబూరు రహదారిలోని జగనన్న అర్బన్ కాలనీలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్కో ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్ సరఫరాకు సంబంధించి టౌన్-1 ఫీడర్ పరిధిలో యాలం కూడలి, నవోదయ నగర్లో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రీసర్వేతో భూ సమస్యలకు చెక్

పాలకొండ రూరల్: సమగ్ర భూ సర్వే ప్రక్రియతో దీర్ఘకాలంగా పేరుకుపోయిన భూ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పట్టణ శివారులో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. సర్వే బృందాలకు పలు సూచనలు చేశారు. భూ హక్కుదారుల, రైతుల సహకారంతో సకాలంలో సర్వే పూర్తి చేయాలన్నారు. బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. శుక్రవారం సర్వే నంబర్ 197 నుంచి 201, 265 – 267, 269 మధ్య (అచ్చుత మిల్లు వెనుక భాగం)లో ఉన్న తోటల్లో రోవర్ సహాయంతో సర్వే చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత రైతులు, హక్కుదారులు పూర్తి వివరాలతో సర్వేకు హాజరు కావాలన్నారు. మండల సర్వేయర్ పి.వెంకటరమణ, వీఆర్వోలు బి.సాయి శ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు జి.గణేష్, నాగరాజు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడి యాజమాన్యం చాలా కీలకం



ట్రేలలో తయారుచేస్తున్న వరినారులో తెగుళ్లను పరిశీలిస్తున్న ఏఓ ఎస్. అవినాష్

• ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని నేలల ఆరోగ్యపరిరక్షణకు పచ్చిరొట్ట ఎరువులు దోహద పడతాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు గురువారం కె. వెంకటాపురం గ్రామంలో ఏఓ ఎస్.అవినాష్ అధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా పచ్చిరొట్ట పంటసాగు చేస్తున్న భూముల్లో రసాయన ఎరువు ఉత్పత్తి చేయడం వల్ల రసాయన ఎరువులను తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యం కాపాడడంలో పచ్చిరొట్ట ఎరువులు కీలకమైన పాత్ర పోషిస్తాయని, ఖరీఫ్పంట కాలానికి ముందే జీలుగు, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని, పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా భూమి క్షారత్వం తగ్గుతుందని, దానివల్ల ముందుగా ఏర్పడిన చౌడు సమస్యను తగ్గించుకోవచ్చని, భౌతిక లక్షణాలు మెరుగవుతాయని, భూమిలో నీటిని నిలుపుకునే సామర్థ్యంతో పాటు గాలి కదలిక కూడా మెరుగవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పొలంబడి రైతులు, గ్రామ పెద్దలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యం

• ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఒబ్బంగి పంచాయతీ బీముపురం వద్ద వంతెన నిర్మాణానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: రాష్ట్రంలో టీడీపీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఒబ్బంగి పంచాయతీ భీముపురం గ్రామ సమీపంలో ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రూ.80 లక్షలతో వంతెన నిర్మాణం, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.60 లక్షలతో గానలి గిరిజన గ్రామ జంక్షన్ నుంచి లిక్కిడి గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమని విమర్శించారు. వైఎస్సార్సీపీ నాలుగేళ్ల పాలనలో గిరిజనులకు విద్య, వైద్యం సకాలంలో అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకాలమ్మ, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, బిడ్డిక రాజేశ్వరి, విద్యారాణి, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, మైనార్టీ సంఘ నాయకులు షేక్ నూర్బెల్ల, షేక్ ఆదిల్, శ్రీధర్, ఆకుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన : డీఐవో



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డీఐవో డాక్టర్ జగన్మోహన్రావు

కొమరాడ: సీజనల్గా వచ్చే వ్యాధులపై విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) డాక్టర్ టి.జగన్మోహన్రావు అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. కళ్ల కలకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని వైద్య సిబ్బందిక సూచించారు. హెచ్ఎం వెంకటనాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మహిళా కార్మికుల దీక్షలు

పాలకొండ: మున్సిపల్ మహిళా కార్మికులు గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా పలు రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టిన వీరు గురువారం నుంచి నగరపంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దావాల రమణారావు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యూలర్ చేయాలని కాకుంటే సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. శిబిరాన్ని మహిళా న్యాయవాది పద్మలత, బి.అమరవేణి ప్రారంభించారు.

గురుకుల భోజనాల తీరుపై అసంతృప్తి

భామిని: స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా గురుకులాల డీసీవో టి.పద్మజ గురువారం సందర్శించారు. నిర్వహణ తీరుపై మండి పడ్డారు. గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు, విద్యార్థుల సంఖ్యకు, వండిన వంటలకు సరిపోవడం లేదని మందలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. బోధనాంశాలు, మెనూ అమలుపై ఆరా తీశారు. నిలువ చేసిన సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడ్డు సైజ్పై నిలదీశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ విజయనిర్మల, బోధనా సిబ్బంది ఉన్నారు.

అర్హులకు న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

• డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: అర్హత ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలతో పాటు, ప్రభుత్వ సేవలు అందని అర్హులకు న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. ఈ మేరకు మండలంలోని పాంచాలి గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. జగనన్న సురక్ష ద్వారా పాంచాలి సచివాలయం పరిధిలో 447 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శులు పాచిపెంట వీరనాయుడు, కలువలపల్లి పెద్దిబాబు వైస్ ఎంపీపీ కొరుపల్లి రవీంద్ర, జీసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు, మాజీ సర్పంచ్ శనాపతి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ యచ్చం వెంకట్రావు వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు చింత సీతయ్య, పలువురు సర్పంచ్ లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు

ఆయుర్వేద మందులే కీలకం



రోగులకు వైద్య పరిక్షలు చేస్తున్న డాక్టర్ టి.హేమాక్షి

సీతానగరం: ఆయుర్వేద మందులు సీజనల్ వ్యాధుల నివారణకు దోహదపడతాయని బూర్జ ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు మండలంలోని నిడగల్లులో సర్పంచ్ ఆర్. ఆరుద్రమ్మ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ పర్యవేక్షణలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో భాగంగా జలుబు, దగ్గు, ఆయాసం, మలబద్ధకం, కీళ్ల నొప్పులు, జీర్ణకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆయుర్వేదంలో మంచి మందులున్నాయని తెలియజేశారు.

అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆయుర్వేద మందుల వినియోగం, యోగా విద్య వల్ల వ్యాధుల నివారణకు తీసుకోవలసిన అంశాలను వివరించారు. ఆయుర్వేదం మందుల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలియ జేశారు. వైద్య శిబిరంలో 85 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ టి.హేమాక్షి తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మౌలిక సదుపాయాల కల్పనకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని 28వ వార్డు చిన దేవర వీధిలో రూ.10 లక్షల సాధారణ నిధులతో సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ పురపాలక సంఘం ప్రజానీకానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామన్నారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బి గౌరీశ్వరి, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్ సభ్యులు మజ్జి శశికర్, వై త్రినాథ, ఆర్. చిన్నంనాయుడు, ఎన్.సుధీర్, ఆర్.శివకుమార్, కో ఆప్షన్ సభ్యులు ఎం. వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, సీనియర్ నాయకులు రెడ్డి రవి కుమార్, ఎస్వీ ఎస్ఎన్రెడ్డి, పి.శ్రీనివాసరావు, షఫి, ఎస్.ప్రకాశ్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

పార్వతీపురం మండలం పరిధిలో గల బందలుప్పి-అంటివలస-వీరభద్రపురం గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ. 1.90 కోట్ల నిధులతో 5.6 కిలోమీటర్ల నూతన బీటీ రహదారి నిర్మాణానికి గురువారం అంటివలస గ్రామం వద్ద ఎమ్మెల్యే జోగారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రహదారుల పనులు విడిచిపెట్టి వాటి నిధులన్నీ స్వాహా చేశారని, నేడు ఆ రహదారుల నిర్మాణాన్ని పూర్తి వైఎస్సార్సీపీ ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. గతంలో గ్రామాలలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన రహదారి సమస్య పరిష్కారానికి మాట ఇచ్చినట్లు చెప్పారు. గ్రామస్తుల చిరకాల కోరిక అయిన రహదారి నిర్మాణం ప్రారంభించామని వాతావరణం అనుకూలంగా ఉంటే పది రోజుల్లోనే పనులు పూర్తవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ మండల సీనియర్ నాయకులు యాళ్ల ఈశ్వర ప్రతాప్, మజ్జి శేఖర్, సర్పంచ్ గొర్లి రాజేంద్ర ప్రసాద్, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు యాళ్ల శ్రీరాములు నాయుడు, బి.శేఖర్, వి రామకృష్ణ, ఎ వెంకటరమణ, నల్లం నాయుడు, డి.నారాయణరావు, నల్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు త్వరగా పూర్తి చేయాలి : పీవో



రెవెన్యూ అధికారుల నుండి వివరాలు తెలుసుకుంటున్న పీవో కల్పనాకుమారి

పాలకొండ రూరల్: ప్రజలకు మెరుగైన సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నిర్మిస్తున్న సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు సకాలంలో పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. పాలకొండ మండలం అంపిలి, గోపాలపురం తదితర గ్రామాల్లో గురువారం పర్యటించిన పీవో అక్కడ నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ భవనాలను సందర్శించి వాటి పురోగతిపై అధికారులను ఆరా తీశారు. శాశ్వత ప్రాతిపదికన సేవలు అందించే ఈ భవనాల నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లోపాలు గుర్తిస్తే సహించమని, చివరి దశలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పట్టణ పరిధిలో ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించిన పీవో ఈ స్థల వివాదం కోర్టులో ఉన్న క్రమంలో వాటి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ సింహాచలం, స్థానిక తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, పలు శాఖల అధికారులు ఉన్నారు.